ఆస్తిపన్ను చెల్లించకుంటే జప్తుచేస్తాం

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 19: ఆస్తిపన్ను సకాలంలో చెల్లించని పక్షంలో వారి ఆస్తులను జప్తుచేస్తామని మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని పలువార్డుల్లో బుధవారం ఆయన పర్యటించి ఆస్తిపన్నులపై అవగాహన కల్పించారు. ప్రజలు తప్పకుండా ఆస్తి, నల్లా పన్నులు చెల్లించి అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తే వారి ఆస్తులను చట్ట ప్రకారం జప్తుచేస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక ఎఫ్‌ఎస్‌టీపీ పనులను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ కనకయ్య, వార్డు అధికారులు సాంబరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆస్తిపన్నుకు సంబంధించిన నోటీసు అందజేస్తున్న కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్

ముగిసిన క్రీడలు

సిద్దిపేట, ఫిబ్రవరి19: సిద్దిపేటలోని లఘు క్రీడా మైదానంలో నెహ్రూ యువ కేంద్ర సహకారంతో వాలీబాల్ యూత్ అసోసియేషన్ ముర్షద్‌గడ్డ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడలు బుధవారం ముగిశాయి. గెలుపొందిన విజేతలకు పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి సౌందర్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాలీబాల్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండి దాసు, ఉపాధ్యక్షుడు గుండి నాగేందర్, ప్రధాన కార్యదర్శి గుండిప్రవీణ్, ఫుట్‌బాల్ కార్యదర్శి అక్బర్ నవాబ్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, బాబు, లక్ష్మణ్, లతీఫ్, దేవ రాజ్, హరి, బ్రహ్మం, కనుకయ్య, ఎన్‌వైకే కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సౌందర్య

డీటీపీ కోర్సును వినియోగించుకోవాలి

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 19 : డీటీపీ కోర్సును వినియోగించుకోవాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత విద్యార్థులకు సూచించారు.కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో డీటీపీ,ఫొటోషాప్ కోర్సును బుధవారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..డీటీపీ కోర్సు 30 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కోర్సు నేర్చుకోవడం మూలంగా పత్రికారంగం,పుస్తక ముద్రణ, డాక్యుమెంట్ల తయారీలో అవకాశాలు ఉన్నాయన్నారు. అధ్యాపకులు సంపత్‌కుమార్‌రెడ్డి,హరీశ్, వెం కటరమణ,నరేశ్, సంపత్, రామస్వామి, శైలజ, సాయి, సురేశ్, రమణ, నరసింహులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

పాలిటెక్నిక్ విద్య భవిష్యత్‌కు బాట

నంగునూరు, ఫిబ్రవరి 19 : పాలిటెక్నిక్ విద్య బంగారు భవిష్యత్‌కు బాట లాంటిదని రాజ గోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.గోవర్ధన్ అన్నారు. బుధవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో ప్రవేశం, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి ప్రధానోపాధ్యాయుడు రామస్వామిగౌడ్‌తో కలిసి ప్రవేశ వివరాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అతి తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండే విద్య పాలిటెక్నిక్ అని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా త్వరగా సాధించవచ్చున్నారు. టెన్త్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాలిటెక్నిక్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకోవాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, వైదేవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న టీచర్లు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

బాలాజీనగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

దుబ్బాక, ఫిబ్రవరి19: దుబ్బాక పట్టణంలోని బాలాజీనగర్‌లో బుధవారం సీసీ కెమెరాలను దుబ్బాక ఎస్సై గంగారాజు ప్రారంభించారు. కాలనీలో దొంగతనాలు , అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు కాలనీవాసులంతా కలిసి సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కాలనీవాసులను ఎస్సై ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బాలాజీ దేవాలయ చైర్మన్ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకుడు కృష్ణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై గంగారాజు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక పూజలు

హుస్నాబాద్, ఫిబ్రవరి 19: హుస్నాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా మహిళా భక్తబృందం ఆధ్వర్యంలో బుధవారం సామూహిక పూజలు నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లకు చీర సారెలు, పట్టుబట్టలు సమర్పించారు. అంతకు ముందు పట్టణంలోని పార్థసారథి గీతామందిరం నుంచి చీర, సారెలు, బొట్టు కుంకుమలతో వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. సంకల్ప సహిత పూజ, అష్టోత్తర నామస్మరణ చేసిన అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులకు ప్రేమలత అనే భక్తురాలు బొట్టు, పసుపు పంపిణీ చేశారు

పసుపు, కుంకుమలు, పట్టు వస్త్రాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

న్యాయ సలహాల కోసం సంప్రదించాలి

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 19 : న్యాయపరమైన సలహాలు,సూచనల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100ను సంప్రదించాలని జడ్జి స్వాతిరెడ్డి సూచించారు.సిద్దిపేట జిల్లా జైలులో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఖైదీల వంట గది,స్టోర్ రూమ్‌లను ప్రత్యేకంగా పరిశీలించారు. ఖైదీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు.అనంతరం స్వాతిరెడ్డి మాట్లాడుతూ..ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలన్నారు.కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వికాస్,న్యాయ సేవాధికార సంస్థ,జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

ఉద్యమకారుడు రవీందర్‌సింగ్‌ను గెలిపిద్దాం

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 19 : తెలంగాణ ఉద్యమ కారుడు రవీందర్‌సింగ్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపించుకుదామని శాతవాహన జేఏసీ చైర్మన్,వ్యవస్థాపకుడు చెన్నమల్ల చైతన్య పిలుపునిచ్చారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైతన్య మాట్లాడారు. పట్టభద్రులు సంక్షేమానికి నిరంతరం పాటు పడే రవీందర్‌సింగ్ గెలుపు కోసం అందరూ ముందుకు వస్తున్నారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పట్టభద్రులు రవీందర్ సింగ్‌కు మద్దతు తెలుపడం విజయ సంకేతానికి నాందిఅన్నారు.కరీంనగర్ మేయర్‌గా ఉన్నప్పుడు రూపాయికే అంత్యక్రియలు, రూపాయికి ఇంటింటికీ నల్లా ,మధ్యాహ్న భోజనం ఇలా గొప్ప కార్యక్రమాలు నిర్వహించి చరిత్ర సృష్టించారన్నారు. కార్యక్రమంలో నేతలు నరేశ్,బండ అశోక్,అఖిల్ పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న శాతవాహన జేఏసీ నేతలు

ఆర్థికసాయం అందజేత

చేర్యాల, ఫిబ్రవరి 19 : చేర్యాల పట్టణంలోని రెండో వార్డుకు చెందిన కాటం శ్రీధర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను చేర్యాల గౌడసంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు సిద్ధిరాములుగౌడ్ పరామర్శించి రూ.5వేలు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న సిద్ధిరాములుగౌడ్

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

సిద్దిపేట అర్బన్: సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ మనుచౌదరి

నారాయణరావుపేట: హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19 : హాస్టల్‌లో ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ మనుచౌదరి నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీకృత వసతి గృహాల సముదాయ భవనాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న 235 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కల్పిస్తున్న భోజన సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్ రూమ్‌లో పరిశుభ్రత, స్టోర్ రూమ్‌లో వంట సామగ్రిని పరిశీలించి మెనూ ప్రకారం ఆహారం అందించాలని, హాస్టల్‌కు అవసరమైన సంపు నిర్మాణానికి ఈడబ్ల్యూఐడీసీ అధికారులచే ఎస్టిమేషన్ చేసి పంపించాలన్నారు. ఇన్‌చార్జి ఎస్సీ అభివృద్ధి అధికారి ఎండీ.హమీద్ పాల్గొన్నారు.

గుర్రాలగొంది గ్రామంలో..

నారాయణరావుపేట, ఫిబ్రవరి 19 : గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. మండలంలోని గుర్రాలగొందిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. గురుకులంలోని డార్మెటరీ, స్టోర్‌రూమ్, కిచెన్, హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ కావాలని టీవర్లు కలెక్టర్‌ను కోరారు.

మెనూ అమలు చేయకపోతే సస్పెండ్ చేస్తా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19 : గురుకుల విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాల్లో కామన్ డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించని అధికారులను సస్పెండ్ చేస్తానని కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో కామన్ డైట్ మెనూ ఇంప్లిమెంటేషన్ పై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఆర్సీవోలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయా శాఖల వారీగా గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అందిస్తున్న మెనూ వివరాలు, వాటిని అందించడంలో కలుగుతున్న సమస్యలను సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌వో, ఇన్‌చార్జి బీసీ డెవలప్‌మెంట్ అధికారి నాగరాజమ్మ పాల్గొన్నారు.

మార్చి 15 వరకు పూర్తి చేయాలి

మున్సిపాలిటీల్లో మార్చి 15వ తేదీ వరకు ట్యాక్స్ కలెక్షన్ పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వచ్చే ఆర్థిక సంవత్సరం మున్సిపల్ బడ్జెట్ ప్రిపరేషన్‌పై మున్సిపల్ కమిషనర్లు, మెప్మా, మున్సిపల్ ఇంజినీర్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ ఆదాయ వనరులైన ఇన్‌కమ్ ట్యాక్స్, ప్రాపర్టీ ట్యాక్స్ వంటి వాటిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వచ్చిన ఆదాయంలో మున్సిపల్ సిబ్బంది జీతాలు, ఎలక్ట్రిసిటీ బిల్, వాటర్ సప్లయ్, శానిటైజేషన్ పనులతో పాటు తప్పకుండా బడ్జెట్‌లో 10 శాతం గ్రీన్ బడ్జెట్ పెట్టాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

ఐసీఈయూ కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న బ్రాంచ్ మేనేజర్ తదితరులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 19: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం హుస్నాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్ది సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కరుణాకర్, కార్యదర్శిగా రాజేశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా వి.వెంకటరాజు, ఎస్. అశోక్‌కుమార్, కోశాధికారిగా వెల్దండి కిషన్, కార్యవర్గ సభ్యులుగా రాజేంద్రప్రసాద్, శంకర్‌కుమార్, అవంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని బ్రాంచి మేనేజర్ వెంకట రమణ, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ అనిల్‌కుమార్ అభినందించారు.

కలిసిమెలిసి ఉండాలి



వేచరేణి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాజు

చేర్యాల, ఫిబ్రవరి 19 : గ్రామస్తులు కలిసి మెలిసి ఉండాలని కొమురవెల్లి ఎస్సై లింగంపల్లి రాజు సూచించారు. బుధవారం చేర్యాల మండలంలోని కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేచరేణి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలను అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దన్నారు. స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా గ్రామస్తులు సహకరించాలని కోరారు.గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

'దుమ్ము దుమారం' పాట చిత్రీకరణ

కొమురవెల్లిలో పాట చిత్రీకరణలో భాగంగా క్లాప్ కొడుతున్న హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసుతేజావత్

చేర్యాల, ఫిబ్రవరి 19 : డీటీఆర్ మూవీస్ ఆధ్వర్యంలో దుమారం చిత్రంలోని దుమ్ము దుమారం పాటను కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిసరాల్లో బుధవారం చిత్రీకరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్ క్లాప్ కొట్టగా కొమురవెల్లి మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దుమ్ము దుమారం పాట చిత్రీకరణను కొమురవెల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు చూసేందుకు రావడంతో కోలహలంగా మారింది. పాటలు శ్రీపాల్ రచించగా పుష్ప 2 సినిమాలో పాడిన కందూకూరి శంకర్‌బాబు ఈ సినిమా పాటల పాడాడు. చిత్రాన్ని తిరుపతి, మల్లిక్‌బాబు, పండుగౌడ్, వినయ్ శంకర్‌గౌడ్ నిర్మాణం చేయగా జీఎల్‌బీ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 19 : విద్యార్థులు ఉపాధ్యాయుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. తోటి విద్యార్థులకు బోధన చేశారు.కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిప్పారం ప్రాథమిక పాఠశాలలో

కొండపాక(కుకునూరుపల్లి), పిబ్రవరి 19 : విద్యార్థులు స్వయం పరిపాలనతో తమ బాధ్యతలు తెలుసుకుంటారని కుకునూరుపల్లి విద్యాధికారి సత్తయ్య అన్నారు. బుధవారం మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంఈవో సత్తయ్య హాజరై మాట్లాడారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీఆర్‌పీ సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి: మోతె ప్రాథమిక పాఠశాలలో పాల్గొన్న విద్యార్థులు

తిప్పారం ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు

కబడ్డీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలి

గజ్వేల్, ఫిబ్రవరి 19: కబడ్డీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి భవిష్యత్‌లో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఇటీవల హర్యానా రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి సీనియర్ స్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారిణి రాణిని బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హైదర్‌పటేల్, శివ, మల్లేశం, మహేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని ధర్మారెడ్డిపల్లికి చెందిన కిరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈవిషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. వర్గల్ మండలం చౌదర్‌పల్లికి చెందిన చింతల వెంకటేశ్ ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కబడ్డీ క్రీడాకారిణి రాణిని సన్మానిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ప్రొబెషనరీ ఎస్సై మానస

చేర్యాల, ఫిబ్రవరి 19 : మండలంలోని కడవేర్గు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం చేర్యాల ప్రొబెషనరీ ఎస్సై మానస, సిద్దిపేట షీ టీమ్‌తో కలిసి సైబర్ నేరాలతో పాటు మహిళ రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా మంది ఈజీగా డబ్బు వస్తుందని ఆశపడి సైబర్ నేరాల బారిన పడుతున్నారని, తెలియని వ్యక్తులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింక్స్‌ను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఆడవారి పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే షీ టీమ్ లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీ టీమ్ బృందం పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఎన్నారై చేయూత

చేర్యాల, ఫిబ్రవరి 19 : మండలంలోని ముస్త్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ముస్త్యాలకు చెందిన శాశ్వత నిధి దాత ఎన్నారై దంపతులు పెదుతల బాలమణి-ప్రతాప్‌రెడ్డి చేయూతనిచ్చారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన వారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోతుల బెడద తప్పేలా గ్రిల్స్ ఏర్పాటు చేయించడంతో పాటు గదులకు మరమ్మతులు చేయించి ఆకర్షణీయమైన రంగులు వేయించారు. బుధవారం పాఠశాలకు ప్రింటర్‌తో పాటు మైక్ సెట్ అందజేశారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నారై దంపతులు పెదుతల బాలమణి-ప్రతాప్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెదుతాల ఎల్లారెడ్డి, పాఠశాల హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రింటర్ అందజేస్తున్న ఎన్నారై దంపతులు పెదుతల బాలమణి-ప్రతాప్‌రెడ్డి

జాబ్ మేళాకు విశేష స్పందన

గజ్వేల్, ఫిబ్రవరి 19: ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్‌లో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మినీ జాబ్ మేళాలో 12మంది కళాశాల విద్యార్థులు, 13 మంది నిరుద్యోగ అభ్యర్థులు వివిధ సంస్థలు నిర్వహించిన ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో యాక్సిక్ బ్యాంక్ వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిఖిత్ అంజుమ్, యాక్సిక్ బ్యాంకు హెచ్ఆర్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా శివాజీ జయంతి

జిల్లా వ్యాప్తంగా శివాజీ జయంతిని జరుపుకొన్నారు. బుధవారం శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోహెడ మండలం ఆరెపల్లిలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.గజ్వేల్ మండలంలోని పిడిచేడ్, ముట్రాజ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాలను ఆవిష్కరించారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి19

గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

సిద్దిపేటలో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్‌లో జరిగిన శివాజీ జయంతిలో మాట్లాడుతున్న శివకుమార్

మద్దూరులో శివాజీ జయంతిలో పాల్గొన్న నాయకులు

ధూళిమిట్ట: జాలపల్లిలో శివాజీ జయంతిలో పాల్గొన్న నేతలు

దుద్దెడలో శివాజీ జయంతి నిర్వహిస్తున్న నాయకులు

మిరుదొడ్డిలో శివాజీ విగ్రహానికి పూల మాల వేస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి: గుండారంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

క్రీడాకారులు రాణించాలి

మర్కూక్, ఫిబ్రవరి19: క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని బీసీ సెల్ మర్కూక్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య అన్నారు. మండలంలోని దామరకుంటలో పది రోజులుగా అండర్16 కబడ్డీ ఆటల ట్రైనింగ్‌ను ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజమైన కృష్ణయాదవ్, కోచ్ నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్ వారికి భోజన ఖర్చులు, క్రీడాకారుల ఖర్చులకు రూ.10000 వేలు అందించి ఆయన సేవాగుణాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మర్కూక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, లతీఫ్, చంద్రంగౌడ్ పాల్గొన్నారు.

నర్సన్నపేట పాఠశాల తనిఖీ

మర్కూక్, ఫిబ్రవరి19: మండలంలోని నర్సన్నపేట ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి వెంకట్‌రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంపై ఆరాతీశారు.విద్యార్థుల ప్రతిభపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ధరావత్ ప్రియాంక పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి జరిమానా,జైలు

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 19 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబుకు సిద్దిపేట న్యాయస్థానం జరిమానా,జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పునిచ్చింది. టూ టౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం..సర్కిల్ పరిధిలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం తాగి వాహనం నడుపుతూ మందుబాబు పట్టుబడ్డాడన్నారు. జడ్జి కాంతారావు ఎదుట హాజరు పర్చగా విచారణ జరిపిన మందుబాబుకు మూడు రోజుల జైలు శిక్ష, ఐదు వందల జరిమానా విధించారు.

నీటితో చేర్యాల పెద్దచెరువు నింపాలి

చేర్యాల, ఫిబ్రవరి 19 : చేర్యాల పట్టణంలోని పెద్ద చెరువును నింపాలని చేర్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఎండాకాలం ప్రారంభంలోనే నీటి ఎద